
# బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం వదిలిపెట్టి కులాలు, మతాలంటూ ప్రజల్లో విద్వేషాలు నింపుతుంది





**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (14 ఆగస్ట్ 2026)** దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మోడీ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ వదిలి పెట్టి కులాలు, మతాలంటూ ప్రజల్లో విద్వేషాలు నింపుతుందని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం లో గల హల్ద్వానీ లో దేశ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వేదికపై ఉండటం ఆ ప్రదేశాన్ని "అపవిత్రం" చేసిందని, అందువల్ల దానికి దళితుడు అని ఉద్దేశంతో బీజేపీ నాయకులు గంగాజలం తీసుకొచ్చి శు ద్ధీకరణ చేశారు. హల్ద్వానీ ఘటనకు వ్యతిరేకంగా మల్లికార్జున్ ఖర్గే కి సంఘీభావంగా మహేశ్వరం నియోజక వర్గం లో గల జిల్లెలగూడ డివిజన్ లో చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి చందన చెరువు కట్టపై ఉన్న గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ 80 ఏళ్లు ఉన్న మల్లికార్జున ఖర్గే ఏడుసార్లు ఎంపీగా, రాజ్యసభ సభ్యుడుగా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టారన్నారు. ప్రస్తుతం అధ్యక్ష స్థానంలో ఉన్న అతన్ని దళితుడనే పేరుతో అవమానించడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రేస్ ప్రభుత్వలో దళితులకు గిరిజనులకు ఆత్మగౌరవం ఇచ్చే విధంగా ప్రభుత్వం నడిపేవారున్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమ పథకాలు గాలికి వదిలేసి కులం మతం అంటూ ప్రజల్లో విద్వేషాన్ని నింపుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగా కాంగ్రేస్ ప్రభుత్వం లో అనేక కార్యక్రమాలు చేపడితే బీజేపీ 10 సంవత్సరాల కాలంలో అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా కులాల ప్రాతిపదికన రాజకీయాలను చేస్తూ అగౌరవ పరుస్తున్నారన్నారు. అత్యంత హేయమైన ఈ చర్య, బీజేపీ పెంపొందిస్తున్న అంతర్లీన వివక్షపూరిత మనస్తత్వానికి స్పష్టమైన ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు ఈ సిగ్గుమాలిన తిరోగమన చర్య కాంగ్రెస్ అధ్యక్షుడిని అవమానించడమే కాదని, ఇది కోట్లాది మంది భారతీయుల గౌరవానికి సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం వంటి రాజ్యాంగ విలువలకు అవమానమన్నారు. భారత రాజ్యాంగం చేత పాలించబడే ప్రజాస్వామ్య సమాజంలో ఇటువంటి వివక్షపూరిత పద్ధతులకు, మనస్తత్వాలకు స్థానం లేదన్నారు. రాహుల్ గాంధీ భవిష్యత్తులో ప్రధానిగా అవుతాడని భయంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, బీజేపీ ప్రభుత్వం సిగ్గుమాలిన ప్రభుత్వమని ఆయన తెలిపారు. త్వరలోనే బీజేపీ ప్రభుత్వానికి దేశ ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైనదని తెలిపారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏనుగు జంగారెడ్డి , కృష్ణ నాయక్ , మధుసూదన్ , శేఖర్ రెడ్డి సురేందర్ రెడ్డి, చల్లా బాల్ రెడ్డి, సిద్ధాల శ్రీశైలం, ధనరాజ్ గౌడ్, పున్న గణేష్ నేత, బంగారి అశోక్, శ్రీరాములు, రాణా ప్రతాపరెడ్డి, నవారు మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, గజ్జల రామచంద్రం, పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం శ్రీనివాస్ రెడ్డి, నవీన్ గౌడ్, సైదులు, అశోక్, దర్శన్, జగన్, మహిళా నాయకురాలు గంగమ్మ , మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా వారియర్ సిద్దేశ్వర చారి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మోదీ విధానాలపై సమరం.. నాట్లు వేసిన సీపీఐ నేతలు

**ఎరువుల ధరల పెంపుతో సామాన్యులపై భారం.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దింపాల్సిందే!**

**లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు భంగం.. ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ధ్వజం**






**మన తొలివెలుగు, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ చేపట్టిన 'ప్రజా చైతన్య యాత్ర' శుక్రవారంతో ముగిసింది. రేవల్లి మండలం తలుపునూరు, తలుపునూరు తండాల్లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు కృష్ణవేణి, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు జయమ్మ నేరుగా పొలాల్లోకి దిగి రైతుకూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. రూ.1000 లోపు ఉన్న డీఏపీ బస్తా ధరను మోదీ ప్రభుత్వం రూ.2,300కు పెంచి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. ?గోపాల్‌పేటలో జరిగిన ముగింపు కార్యక్రమంలో సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలు పెంచి సామాన్యులపై భారం మోపారని, లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులను కాలరాశారని విమర్శించారు. మోదీ పాలనకు స్వస్తి చెప్పేందుకు పేదలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, వెంకటమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ గుడిలో.. సమాధులను తలపిస్తున్న శిలాఫలకాలు

**ఫోటో పోటీగా ఏర్పాటు ఈనెల 23న బోనాలు**



**మన తొలివెలుగు యాదాద్రి భువనగిరి జిల్లా రిపోర్టర్ జంగిటి రవీందర్ :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైనా బోనాల పండుగ సమీపిస్తున్న వేళ భువనగిరి హనుమాన్ వాడ పోచమ్మ దేవాలయంలో అభివృద్ధి పేరుతో వెలసిన శిలాపలకాలు సమాధులను తలపిస్తున్నాయి. ఆలయ అభివృద్ధి పేరుతో నిర్మిస్తున్న శిలాఫలకాలు భక్తులకు ఇబ్బందులను తెచ్చి పెట్టేలా ఉన్నాయి. బోనాలలో భక్తుల రద్దీకి ఇవి ఆటంకిగా మారనున్నాయి. గుడిని అభివృద్ధి చేసింది గోరంతయితే .. ప్రచారం కొండంత.. అనే పేరుతో పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్న శిలాఫలకాలు తొలగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా శిలాఫలకాలు ఏర్పాటు చేయడంపై సర్వత్ర చీదరింపులు విమర్శలు ఎదురవుతున్నాయి.

## ఏదులలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర



**మన తొలివెలుగు, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** ప్రధాని మోదీ పిలుపుమేరకు ఏదుల మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు రాము యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ సురేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి, గోపాల్‌పేట ఇంచార్జ్ దాసరాజు ప్రవీణ్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మువ్వన్నెలతో మురిసిన మహబూబ్‌నగర్ జిల్లా





**మన తొలివెలుగు, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం 'తిరంగా యాత్ర' ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ న్యూ టౌన్ నుంచి క్లాక్ టవర్ వరకు సాగిన ఈ భారీ ర్యాలీతో పట్టణం మువ్వన్నెల మయంగా మారింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, బీజేపీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, కులమతాలకు అతీతంగా సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడంలో యువత భాగస్వాములు కావాలన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న కుట్రలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పేర్కొంటూ రాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళా అదృశ్యం



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (14 ఆగస్ట్ 2026)**భిక్షాటన కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ, వెంకటాపూర్ లో నివాసం ఉంటున్న సంపంగి చెన్నమ్మ (60) తన చిన్న కుమారుడు సంపంగి బాలరాజ్ తో కలిసి ఈ నెల 8న ఉదయం 9 గంటల సమయంలో భిక్షాటన గురించి ఇంటి నుండి బయటకు షాహిన్ నగర్ వైపుకు వెళ్ళినారు. సాయంత్రం సంపంగి బాలరాజ్ ఇంటికి తిరిగి రాగా సంపంగి చెన్నమ్మ ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యురాలు సంపంగి నారమ్మ ఫిర్యాదు చేయడంతో నేరం సంఖ్య 476/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తప్పిపోయిన సంపంగి చెన్నమ్మ గురించి ఏమైన సమాచారం ఉన్నట్లయితే బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712662677 లేదా సెల్ నెంబర్ 8712578552, 8712662366 కి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం :

**జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్**

**భువనగిరి కేవీ స్కూల్‌లో ఇంటీరిసే ఇన్స్పైర్ అవార్డ్స్ -2026 కార్యక్రమం**



**మన తొలి వెలుగు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ :**ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీ యమని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు.హైదరాబాద్ యాదగిరి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో భువనగిరి కేవీ స్కూల్‌లో ఇంటీరిసే ఇన్స్పైర్ అవార్డ్స్ 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భువనగిరి, బీబీనగర్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇంటీరిసే ఇన్స్పైర్ అవార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రతిభను గుర్తించి, వారిని మరింత ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.అవార్డుల ప్రదానోత్సవం అనంతరం విద్యార్థులు తమ ప్రతిభ, సృజనాత్మకత, సాంస్కృతిక నైపుణ్యాలను చాటుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, కార్యక్రమ నిర్వాహకులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో డీస్పీ ప్రభాకర్ రెడ్డి, భువనగిరి టౌన్ సిఐ శ్రీ రమేష్, ట్రాఫిక్ సి ఐ శ్రీ మధుసుధన్, ఎస్ ఐ లు, ఇతర పోలీసు సిబ్బంది, కేవీ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి :

**కలెక్టర్ అనురాగ్ జయంతి**



**మన తొలి వెలుగు యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటి రవీందర్ :** వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుత వాతావరణ, నీటి లభ్యత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు ఈ వానాకాలంలో వరి పంట సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వరి సాగుకు అవసరమైన నీరు, అందుబాటులో ఉండే పరిస్థితి లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బోర్లలో ప్రస్తుతం నీరు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని, అదే విధంగా విద్యుత్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికీ భూగర్భ జలాల లభ్యత తగ్గే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని 22 రకాల ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్ పి ) కల్పిస్తోందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేసే అవకాశం కూడా ఉందని తెలిపారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇవో) తమ పరిధిలో 500 ఎకరాల వరి సాగు విస్తీర్ణాన్ని ఆరుతడి పంటల వైపు మళ్లించేలా రైతులకు అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు అధికారుల సూచనలు పాటించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ఎంచుకుని, పంట వేయాలని కలెక్టర్ కోరారు.

## బిజినెస్

### ఐపీవోకు ముత్తూట్ ఫిన్‌కార్ప్.. రూ.3,000 కోట్లపై కన్ను




**న్యూఢిల్లీ:** ముత్తూట్ పప్పచాన్ గ్రూప్ కంపెనీ ముత్తూట్ ఫిన్‌కార్ప్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. తద్వారా రూ. 3,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. నిధులను మూలధన పటిష్టతకు వినియోగించనుంది. ప్రాస్పెక్టస్ ప్రకారం కంపెనీ మొత్తం తాజా ఈక్విటీ జారీ ద్వారా నిధులను సమకూర్చుకోనుంది. భవిష్యత్ అవసరాల కోసం టైర్--1 మూలధనాన్ని పెంచుకునేందుకు ఐపీవో పెట్టుబడులను వెచ్చించనుంది. డైవర్సిఫైడ్ ఎన్‌బీఎఫ్‌సీ ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రధానంగా బంగారు ఆభరణాలపై రుణాలందిస్తోంది. అయితే బిజినెస్ రుణాలు, ఆస్తులపై రుణాలు, సప్లై చైన్ ఫైనాన్సింగ్, డిజిటల్ రుణాలు, మైక్రోఫైనాన్స్, గృహ రుణాలు తదితరాలతో పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. రెండు దశాబ్దాలుగా బంగారు ఆభరణాలపై రుణాలు సమకూర్చుతోంది. దేశవ్యాప్తంగా బ్రాంచీల నెట్‌వర్క్‌ను విస్తరించింది. 2026 మార్చి 31కల్లా నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) రూ. 73,445 కోట్లకు చేరాయి. 5,610 బ్రాంచీలను కలిగి ఉంది.

### కేవలం ఒక్క రూపాయి.. 24 రోజుల వ్యాలిడిటీ!

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తన ఫ్రీడమ్ 2.0 పథకం కింద 2026 స్వాతంత్ర్య దినోత్సవం కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టింది. ఈ ఆఫర్‌లో భాగంగా.. వినియోగదారులు కేవలం రూ.1కే కొత్త బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డును పొందవచ్చు. ఈ ఆఫర్ ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 12 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. కొత్త వినియోగదారులు రోజూ 1జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత వాయిస్ కాలింగ్‌ను కూడా పొందుతారు. వ్యాలిడిటీ 24 రోజులు మాత్రమే. కొత్త సిమ్ కనెక్షన్ కోసం అధిక మొత్తం చెల్లించకుండా బీఎస్ఎన్ఎల్ సేవలను ప్రయత్నించాలనుకునే వినియోగదారులకు ఈ ఆఫర్ ఉపయోగకరంగా ఉంటుంది.


రూ.2,399 ప్లాన్!

బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చిన రూ. 2399 రీఛార్జ్ ప్లాన్ ద్వారా 412 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. రోజుకి 2 జీబీ డేటా, 100 ఎస్ఎమ్ఎస్‌లు పొందవచ్చు. ఆఫర్ వ్యాలిడిటీ ఉన్నంత వరకు అపరిమిత కాల్స్ ఆస్వాదించవచ్చు. అయితే ఈ ఆఫర్ కూడా కేవలం సెప్టెంబర్ 12 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని సంస్థ వెల్లడించింది.

నిజానికి చాలా కంపెనీలు యాన్యువల్ ప్లాన్ కింద 365 రోజుల వ్యాలిడిటీ మాత్రమే అందిస్తాయి. కానీ బీఎస్ఎన్ఎల్ మాత్రం మరో 47 రోజుల వ్యాలిడిటీని అదనంగా అందిస్తుంది. అంటే ఏడాది పూర్తయినా ఇంకా కొన్ని రోజులు రీఛార్జ్ చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నమాట. ఇది యూజర్లకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# బ్యాకప్ లేకుండానే.. క్షణాల్లో కొత్త ఫోన్‌లోకి వాట్సప్ డేటా

లకొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసినప్పుడు.. చాలా మంది తమ పాత ఫోన్‌లోని వాట్సప్ చాట్‌లు, ఫొటోలను బ్యాకప్ చేయడానికి గూగుల్ డ్రైవ్ లేదా ఐక్లౌడ్ వంటి థర్డ్ పార్టీ బ్యాకప్‌లపై ఆధారపడుతుంటారు వాస్తవానికి ఈ డేటాను సులువుగా ట్రాన్స్‌ఫర్ చేయడానికి వాట్సప్ ఎప్పటి నుంచో చాట్ ట్రాన్స్‌ఫర్ ఫీచర్‌ను అందిస్తోంది. దీని గురించి అవగాహన లేక చాట్ హిస్టరీని బ్యాకప్ చేసి.. మళ్లీ కొత్తగా వాట్సప్‌ను ఇన్‌స్టాల్ చేసి రీస్టోర్ చేస్తున్నారు. దీనివల్ల మొబైల్ డేటా, సమయం రెండూ వృథా అవుతుంటాయి. వాట్సప్ అందించే చాట్ ట్రాన్స్‌ఫర్ వాడితే క్షణాల్లో మీ చాట్ కొత్త ఫోన్‌లో ప్రత్యక్షమవుతుంది. దీన్నెలా ఉపయోగించాలంటే? తొలుత పాత ఫోన్‌లో వాట్సప్ ఓపెన్ చేసి సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో చాట్స్ ఆప్షన్ క్లిక్ చేయాలి. ట్రాన్స్‌ఫర్ చాట్స్ ఆప్షన్ ఎంపిక చేసుకొని స్టార్ట్ బటన్ నొక్కితే క్యూఆర్ కోడ్ స్కానర్ ఓపెన్ అవుతుంది. ఆపై కొత్త ఫోన్లో మొదట వాట్సప్ ఇన్‌స్టాల్ చేసి ఓపెన్ చేయాలి. టర్మ్స్ అండ్ కండిషన్స్ యాక్సెప్ట్ చేయాలి. పాత ఫోన్‌లోని వాట్సప్ నంబరుతో కొత్త ఫోన్‌లో వాట్సప్ లాగిన్ అవ్వాలి. ఓటీపీతో వెరిఫై కావాల్సి ఉంటుంది. అప్పుడు స్క్రీన్‌పై డేటా ట్రాన్స్‌ఫర్ ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే కొత్త ఫోన్ స్క్రీన్‌పై కనిపించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి.




రెండు ఫోన్లను కనెక్ట్ చేయాల్సిన అనుమతులను యాక్సెప్ట్ చేయాలి. ప్రక్రియ పూర్తయ్యాక మీ పాత ఫోన్‌లోని చాట్‌లు, ఫొటోలు, వీడియోలు అన్నీ యథావిధిగా కొత్త ఫోన్‌లోకి వచ్చేస్తాయి. నూరు శాతం డేటా ట్రాన్స్‌ఫర్ పూర్తయ్యేవరకు రెండు ఫోన్‌లలో వాట్సప్‌ను మూసివేయకుండా పక్కపక్కనే ఉంచాలి. స్మార్ట్‌ఫోన్లలో వైఫై, లొకేషన్ ఆన్‌లోనే ఉంచాలి. ఈ పద్ధతి ఆండ్రాయిడ్ టు ఆండ్రాయిడ్, ఐఫోన్ టు ఐఫోన్‌కు మాత్రమే పనిచేస్తుంది.

ప్రయోజనాలు ఇవీ: మీ వాట్సప్ డేటాను థర్డ్ పార్టీ క్లౌడ్‌లో అప్‌లోడ్ చేసి, మళ్లీ డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. కాబట్టి ఇంటర్నెట్ ఆదా అవుతుంది. డేటా నేరుగా ఫోన్ టు ఫోన్‌కి బదిలీ కావడం వల్ల సమయం ఆదా అవుతుంది. ఇతర యాప్‌లు లేదా క్లౌడ్ సర్వీస్‌ల ప్రమేయం ఉండదు కాబట్టి మీ డేటా పూర్తి సురక్షితంగా ఉంటుంది.

# విలీనానికి ఉబర్- రాపిడో చర్చలు.. ఆ విషయంలో బ్రేక్!

లఅమెరికా రైడ్ హెయిలింగ్ సంస్థ ఉబర్, భారత్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ రాపిడో కలిసి విలీనం దిశగా అడుగులు వేశాయా? దేశీయంగా తమ కార్యకలాపాలను కలిసి నిర్వహించేందుకు చర్చలు జరిపాయా? అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. కానీ, యాజమాన్యం విషయంలో ఇరు సంస్థల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ డీల్‌కు బ్రేక్ పడినట్లు తెలిసింది. తాజాగా ఈ అంశం వెలుగులోకి వచ్చింది. ఉబర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి ఈ ఏడాది మే నెలలో ఐదు రోజుల పాటు భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. దేశంలో పెట్టుబడులు, వ్యాపార విస్తరణ ప్రణాళికలపై ఆయన వరుస సమీక్షలు జరిపారు. ఈ క్రమంలోనే రాపిడోతో విలీనం అంశం చర్చకు వచ్చినట్లు ఎకనమిక్ టైమ్స్ తెలిపింది. క్యాబ్, ఆటో, బైక్ ట్యాక్సీ సేవలందిస్తున్న ఇరు సంస్థలు కలిసి పనిచేయాలని ఉబర్ తొలుత ప్రతిపాదించింది. దేశీయంగా తమ కార్యకలాపాలను రాపిడో బృందమే నిర్వహించాలని తన ప్రతిపాదనలో పేర్కొంది. అయితే, రాపిడో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఉబర్ భారత వ్యాపారాన్ని పూర్తిగా తమకు క్యాష్- స్టాక్ లావాదేవీ రూపంలో విక్రయించాలని పేర్కొంది. రాపిడోలో ఉబర్




మైనారిటీ వాటాదారుగా ఉండేలా ప్రతిపాదన తీసుకొచ్చింది. కానీ, భారత్‌లో తమ వ్యాపారాన్ని పూర్తిగా విక్రయించడం ఇష్టంలేని ఉబర్ ఇందుకు నో చెప్పింది. దీంతో డీల్‌కు బ్రేక్ పడినట్లు తెలిసింది. ప్రస్తుతం రెండు కంపెనీలు వేర్వేరుగా తమ కార్యకలాపాలను నిర్వహించుకుంటున్నాయి. అంతేకాదు రాపిడోకు పోటీగా ఉబర్ తన బైక్ ట్యాక్సీ సేవలను మరో 100 నగరాల్లో ప్రారంభించింది. మొత్తంగా 220 నగరాలకు ఈ సేవలను విస్తరించింది.

# టెస్ట్ నం 600.. చారిత్రక మ్యాచ్‌కు భారత్ సిద్ధం

**నేటి నుంచి శ్రీలంకతో తొలి టెస్టు**

**ఆతిథ్య స్పిన్నర్లతో గిల్ సేనకు పరీక్ష**

**ఉదయం10 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో**

గాలె: దేశ ప్రజలంతా 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో ఉండగా.. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత క్రికెట్ జట్టు చరిత్రాత్మక మైలురాయిని చేరుకోనున్నది. తమ టెస్టు ప్రస్థానంలో 600వ మ్యాచ్‌లో భాగంగా గాలె గడ్డపై శ్రీలంకతో తలపడనుంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తర్వాత ఈ ఘనత సాధించిన మూడో జట్టుగా భారత్ చరిత్రకెక్కనుంది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శనివారం మొదలయ్యే ఈ పోరుతో 50 టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన ఆసియా తొలి మైదానంగా గాలె నిలవనుంది. మరోవైపు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడం ఇరు జట్లకు అత్యంత కీలకం. దాంతో ఆట ఆరంభానికి ముందే ఈ పోరు అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తోంది. లంకలో అడుగు పెట్టింది మొదలు ముమ్మర ప్రాక్టీస్ చేసిన గిల్‌సేన.. ఆతిథ్య జట్టు చేతిలో గత 18 ఏండ్లుగా ఒక్క సిరీస్ కూడా ఓడిపోని రికార్డును కొనసాగించాలని పట్టుదలగా బరిలోకి దిగుతోంది. ఇంకోవైపు స్వదేశంలో అనుకూలతలకు తోడు తమకు అత్యంత బలమైన స్పిన్ వలతో భారత్ పని పట్టాలని లంక ఆశిస్తోంది. దాంతో గాలె పోరు తొలి రోజు నుంచే రసవత్తరంగా సాగే అవకాశం కనిపిస్తోంది.

**రెడ్ బాల్ రీసెట్‌పై గంభీర్ దృష్టి**

గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ టీ20 ప్రపంచకప్, ఆసియా కప్, చాంపియన్స్ ట్రోఫీ లాంటి పరిమిత ఓవర్ల టోర్నీల్లో విజేతగా నిలిచింది. ఏ కోచ్‌కైనా ఇది గొప్ప ఘనతే అయినా.. గౌతీ మాత్రం ఇంటాబయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. అందుకు ప్రధాన కారణం స్వదేశంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌ల్లో ఎదురైన అవమానకర ఓటములే. ఈ వైట్‌వాష్‌లు మన జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ సిరీస్ ఓడిపోతే గంభీర్ పదవికి తక్షణ ముప్పేమీ లేకపోయినా.. టెస్టుల్లో భవిష్యత్తు కార్యాచరణపై బోర్డు వర్గాల్లో తీవ్ర చర్చ సాగే అవకాశం ఉంది. దాంతో ఈ సిరీస్ నెగ్గి సంప్రదాయ ఫార్మాట్‌లో జట్టు ఆటను గాడిలో పెట్టాలని గౌతీ భావిస్తున్నాడు. అయితే గాలెలో లంకకు అద్భుత రికార్డుంది.

1998 నుంచి ఇక్కడ ఆడిన 49 టెస్టుల్లో ఆతిథ్య జట్టు ఏకంగా 27 మ్యాచ్‌లు గెలిచింది. మురళీధరన్, రంగన హెరాత్ శకం ముగిసినప్పటికీ ప్రభాత్ జయసూర్య, రమేష్ మెండిస్ రూపంలో లంకకు బలమైన స్పిన్ దళం ఉంది.



గతంలో మిచెల్ శాంట్నర్, సైమన్ హార్మర్ స్పిన్ ధాటికి చేతులెత్తేసిన భారత్ బ్యాటర్లకు ఇది మళ్లీ పెద్ద పరీక్షే కానుంది. ఈ నేపథ్యంలో కెప్టెన్ గిల్ బ్యాటర్‌గానూ జట్టును ముందుండి నడిపించాల్సిన అవసరం ఉంది. టాపార్డర్‌లో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, గాయపడ్డ సాయి సుదర్శన్ స్థానంలో వన్‌డౌన్‌లో బరిలోకి దిగే దేవదత్ పడిక్కల్ నుంచి భారీ పరుగులు అవసరం. కీపర్ రిషబ్ పంత్, స్పెషలిస్ట్ బ్యాటర్‌గా సర్ఫరాజ్ కంటే మొగ్గున్న ధ్రువ్ జురెల్ కెరీర్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఫామ్ కోల్పోయిన ఈ ఇద్దరూ లంక స్పిన్నర్లను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. ఆల్‌రౌండర్ జడేజా జట్టులో అత్యంత సీనియర్ ఆటగాడిగా స్పిన్ విభాగానికి నేతృత్వం వహించనున్నాడు. అతనికి తోడుగా చైనామన్ కుల్దీప్, మానవ్ సుతార్‌తో కలిపి ముగ్గురు స్పిన్నర్లు, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ రూపంలో ఇద్దరు పేసర్లతో భారత్ బరిలోకి దిగే అవకాశం ఉంది.

**లంక స్పిన్ అస్త్రంతో..**

గత 13 నెలల్లో రెండు టెస్టులు ఆడిన ధనంజయ డిసిల్వా నాయకత్వంలోని శ్రీలంక, సొంతగడ్డపై తమ స్పిన్ అస్త్రాలతో భారత్‌ను దెబ్బతీయాలని భావిస్తోంది. దశాబ్ద కాలంగా లంక టాప్ వికెట్ టేకర్‌గా ఉన్న స్పిన్ లీడర్ ప్రభాత్ జయసూర్యతో పాటు రమేష్ మెండిస్ ఆతిథ్య జట్టు ప్రధాన బౌలింగ్ అస్త్రాలుగా మారనున్నారు. అనుభవం కోసం వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్‌వెలాను ఆతిథ్య జట్టు తిరిగి జట్టులోకి తీసుకుంది. అయితే గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పిచ్‌పై కాస్త తేమ ఉంటే ఆరంభంలో బ్యాటింగ్‌కు అనుకూలించే చాన్సుంది.

**తుది జట్లు (అంచనా)**

భారత్ : రాహుల్, జైస్వాల్, పడిక్కల్, గిల్ (కెప్టెన్), పంత్ (కీపర్), జురెల్, జడేజా, సుతార్, కుల్దీప్ , సిరాజ్, ప్రసిద్ధ్.

శ్రీలంక : ఇగాలగమగే, నిషాన్ , చందిమల్, కమిందు మెండిస్, డిసిల్వా (కెప్టెన్), డిక్‌వెలా (కీపర్), దినూష, ప్రభాత్, రమేష్, అసిత ఫెర్నాండో, లహిరు కుమార.

## స్పోర్ట్స్

### అర్ధ శతాబ్ద ఆకలి తీరేనా.. నేటి నుంచే హాకీ ప్రపంచ కప్..

**అమ్‌స్టెల్‌వీన్ (నెదర్లాండ్స్):** వరుసగా రెండు ఒలింపిక్ పతకాలు అందుకొని పూర్వవైభవం దిశగా ముందుకెళ్తున్న భారత హాకీ జట్టు అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్‌లోనూ మళ్లీ తన మార్కు చూపెట్టేందుకు సిద్ధమైంది. మెగా టోర్నీలో అర్ధ శతాబ్దానికి పైగా అందని ద్రాక్షగా ఉన్న కప్పు కరువుకు తెరదించడమే లక్ష్యంగా భారత పురుషుల హాకీ జట్టు తాజా ఎడిషన్ ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ వేటను ప్రారంభించనుంది. తొలిసారి క్వార్టర్ ఫైనల్ దశ లేకుండా సరికొత్త ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పూల్-డిలో బరిలో నిలిచిన 8వ ర్యాంకర్ భారత్ శనివారం జరిగే తమ తొలి పోరులో 15వ ర్యాంకర్ వేల్స్‌తో 8వ ర్యాంకర్ తలపడనుంది. ఒలింపిక్స్‌లో వరుసగా ఎనిమిది స్వర్ణాలు నెగ్గిన ఘన చరిత్ర ఉన్న భారత్.. ప్రపంచకప్‌లో మాత్రం ఆ స్థాయిలో రాణించలేకపోయింది. 1971లో మొదలైన ఈ టోర్నీ తొలి రెండు ఎడిషన్లలో వరుసగా కాంస్యం, రజతం నెగ్గి.. 1975లో అజిత్‌పాల్ సింగ్ సారథ్యంలో స్వర్ణ చరిత్ర సృష్టించిన తర్వాత మరో కప్పు కాదు కదా కనీసం పతకం దరిదాపుల్లోకి కూడా రాలేదు. అయితే, ఈసారి హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతోంది. స్వాతంత్ర్య దినోత్సవ వేళ వేల్స్‌ను ఓడించి శుభారంభం చేయడం ద్వారా 51 ఏండ్ల కప్పు కలను నిజం చేసేందుకు తొలి అడుగు బలంగా వేయాలని పట్టుదలతో ఉంది. టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన భారత్ అదే నిలకడను ప్రపంచకప్‌లో పునరావృతం చేయాలని భావిస్తోంది. హాకీ ప్రో లీగ్ యూరోపియన్ లెగ్‌లో ప్రపంచ చాంపియన్ జర్మనీ, ఒలింపిక్ విజేత నెదర్లాండ్స్‌ను ఓడించడంతో పాటు స్వదేశంలో ఆసియా కప్ నెగ్గడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. పూల్-డీలో తదుపరి ఇంగ్లండ్ (3వ ర్యాంక్), పాకిస్థాన్ (12వ ర్యాంక్) వంటి కఠిన జట్లతో తలపడాల్సిన నేపథ్యంలో వేల్స్‌పై గెలిచి పూర్తి పాయింట్లు సాధించడం భారత్‌కు అత్యంత కీలకం కానుంది.



**బరిలో అమ్మాయిలూ..**

పురుషుల టోర్నీతో సమాంతరంగా జరిగే అమ్మాయిల వరల్డ్‌కప్‌లో సలీమా టెటె కెప్టెన్సీలో భారత్ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అమ్మాయిల విభాగంలో 1974 ఎడిషన్‌లో నాలుగో స్థానంలో నిలవడమే మన జట్టుకు అత్యుత్తమ ప్రదర్శన. ఈసారి ఎలాగైనా పతకం నెగ్గాలని ఆశిస్తున్న టెటె సేన పూల్-డీలో భాగంగా ఆదివారం చైనాతో టైటిల్ వేటను ఆరంభించనుంది. 18న సౌతాఫ్రికా, 20న ఇంగ్లండ్ తో పోటీ పడనుంది.

**ఫార్మాట్ ఇలా..**

పురుషులతో పాటు మహిళల విభాగంలో ఈ ప్రపంచకప్‌లో తలపడుతున్న 16 జట్లను నాలుగు పూల్స్‌గా విడదీశారు. ఒక్కో పూల్‌లో నాలుగు జట్లు మిగతా మూడు ప్రత్యర్థులతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. ప్రతీ పూల్‌లో టాప్-2లో నిలిచిన టీమ్స్.. తదుపరి రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. ఈ దశలోనూ అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సెమీస్‌కు (ఈసారి టోర్నీలో క్వార్టర్స్ దశను తొలగించారు) క్వాలిఫై అవుతాయి. మహిళల ఫైనల్ ఈనెల 29న, అబ్బాయిల తుదిపోరు 30న జరుగుతుంది.

